
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం, జూన్ 6, 2026 పేజీలు :6





## పాలమూరు రంగారెడ్డి.. ప్రాజెక్టులపై దృష్టి

- 12 లక్షల 30 ఎకరాలకు సాగు నీళ్లే ప్రాజెక్టుల లక్ష్యం
- మిత్రులతో కలిసి ప్రాజెక్టుల వద్ద సందర్శించిన ముఖ్యమంత్రి



# ప్రాజెక్టులు పూర్తి చేసి... పరిశ్రమలకు
# నీళ్లు అందజేస్తాం



- కాంగ్రెస్ ప్రభుత్వంలో 800 కోట్లు ఖర్చు చేశాం
- వట్టెం పంప్ హౌస్ మూడో లిఫ్టును సందర్శించిన సీఎం
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో 12 లక్షల ఎకరాలకు సాగు నీళ్ళు అందించడమే సంకల్పం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత



**నాగర్ కర్నూల్ జూన్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేసి... 12 లక్షల 30 వేల ఎకరాల సాగునీళ్లు అందించడమే కాక, పరిశ్రమలకు కూడా చేయూతానిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పర్యటనలో భాగంగా కుమ్మెర గ్రామం వద్ద, ఉన్న వట్టం పంప్ హౌస్ మూడో లెఫ్ట్ ను మంత్రులతో కలిసి సందర్శించి, ఈ సందర్భంగా పరిశీలించారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా చేపట్టిన ప్రాజెక్ట్ పనుల పురోగతిని సంబంధిత అధికారులతో క్లుప్తంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2020- 23 నాటికి 33 వేల కోట్లు ఖర్చు చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 నుంచి ఇప్పటివరకు ఎనిమిది వందల కోట్లు

### సాగునీటి రంగాన్ని బీఆర్ఎస్
## దెబ్బతీసింది

- పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



### ప్రకృతిని కాపాడకపోతే మనిషికి
## మనుగడే లేదు

పాలమూరు ఎంపీ డి కే అరుణ



## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్
జాతీయ లోక్ అదాలత్ ద్వారానే సత్వర న్యాయం
కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు...
రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు.
.రాజీ మార్గమే రాజమార్గం



### ప్రాజెక్టులు పూర్తి చేసి... పరిశ్రమలకు

# నీళ్లు అందజేస్తాం

ప్రాజెక్టుల నిమిత్తం ఖర్చు చేసి, ప్రాజెక్టులను కొనసాగించడం జరుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అదే మాదిరిగా పెండింగ్లో ఉన్న సివిల్ పనులకు 90 కోట్ల వ్యయంతో పూర్తి చేయనున్నట్టు ఆయన స్పష్టత ఇచ్చారు. ఉన్నత అధికారులు ముఖ్యమంత్రికి ఇక్కడ మొత్తం 10 పంపులు ఉండగా ఐదు పంపులను ఫిట్ చేసి రాయల్ రన్ విజయవంతంగా నిర్వహించామని ముఖ్యమంత్రికి వివరణలో తెలిపారు. అదే మాదిరిగా వర్షాకాలం నేపథ్యంలో నీళ్లు రాగానే వెంకట్రాత్రి రిజర్వాయర్కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 16.74 టీఎంసీలు కాగా ఆపరేషన్ సిస్టం ద్వారా విడుదల వారీగా రిజర్వాయర్ను నింపడం జరుగుతుందని సీఎంకు ఉన్నత శాఖ అధికారులు తెలిపారు. అదే మాదిరిగా పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 12 లక్షల 30 వేల ఎకరాల ఆయకట్టు సాగునీటి అందించే ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయన్నారు. దీంతోపాటు సాగు త్రాగునీరుతో పాటు పరిశ్రమలకు కూడా నీటి వసతిని



కల్పించడమే ప్రభుత్వ ఏకైక సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సందర్శించిన వారిలో క్యాబినెట్ మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఉన్నత శాఖ అధికారులు కార్పొరేషన్ చైర్మన్ నాయకులు తదితరులు ఉన్నారు

# పాలమూరు రంగారెడ్డి..

# ప్రాజెక్టులపై దృష్టి

నాగర్ కర్నూల్ జూన్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )

నాగర్ కర్నూల్ జిల్లా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే ఏకైక లక్ష్యంగా, ప్రాజెక్టుల వద్ద సందర్శించడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గ సభ్యులతో కలిసి, పలు ప్రాజెక్టులను సందర్శించారు. ముందుగా ముఖ్యమంత్రి కొల్లాపూర్ లోని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసంలో అల్పాహారం తీసుకొన్నారు. అక్కడే స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతరులు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లోని ప్యాకేజీ -2,3 హెడ్ రెగ్యులటరీ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇంజనీర్లు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ముఖ్యమంత్రికి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 2,3 ల గురించి వివరించారు అనంతరం పి ఆర్ ఎల్ ఐ లో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ (అంజనగిరి రిజర్వాయర్ )డెలివరీ సిస్టర్ ను ముఖ్యమంత్రి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా నార్లాపూర్,రిజర్వాయర్(అంజనగిరి రిజర్వాయర్)6.4 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉండగా ,మొత్తం 8 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు రూపొందించడం జరిగింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద మొత్తం 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించగా, శ్రీశైలం తిరుగుజలాల ద్వారా నీటిని ముందుగా నార్లాపూర్ రిజర్వాయర్ కు, డెలివరీ సిస్టన్స్ ద్వారా నీరు చేరుకున్న అనంతరం అక్కడి నుండి ఇదే ఎత్తిపోతల పథకంలోని పప్యాకేజీ4,5 లకు పంపించడం జరుగుతుంది. కాగా ఈ పథకం కింద డెలివరీ సిస్టంలో నాలుగు పంపుల ద్వారా ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంపులు సిద్ధంగా ఉండగా, మరో నాలుగు పంపులు కూడా నీటి ఎత్తివేతకు సిద్ధంగా ఉన్నాయి.ప్యాకేజీ -2,3 సుమారు 8.3 కిలోమీటర్లు, ప్యాకేజ -416 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది. ప్యాకేజి -5 లో ఉన్న ఏదుల పంప్ హౌస్ కు నీటిని తరలించేందుకు డిజైన్ చేయడం జరిగింది. నార్లాపూర్ రిజర్వాయర్ నుండి ప్యాకేజీ 2 ,3, 4 ద్వారా ఏదుల పంప్ హౌస్ కు సాగునీటిని పంపించడంలో ఉన్న ఇబ్బందులు,ప్రస్తుత పరిస్థితులను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. పూర్తి వివరాలను రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి ఎం జి కే ఎల్ ఐ పంప్ హౌస్ ను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పాడి పరిశ్రమ, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ శాసనసభ్యులు ఏన్నం శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు

### సాగునీటి రంగాన్ని బీఆర్ఎస్

# దెబ్బతీసింది

మహబూబ్‌నగర్, జూన్ 5 ( ప్రజాజ్యోతి బ్యూరో ) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ సాగునీటి రంగాన్ని పూర్తిగా నాశనం చేసిందని రాష్ట్ర సాగునీటి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తం కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులను రెండు రోజుల పాటు విస్తృతంగా పరిశీలించిన అనంతరం శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొనసాగుతున్న, ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వేగవంతం చేసి, ఏళ్లుగా కొనసాగుతున్న అడ్డంకులను తొలగించడమే ఈ పర్యటన లక్ష్యమన్నారు.

పాలమూరు --రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జూరాల నుంచి నీటి వనరును శ్రీశైలానికి మార్చడమే గత ప్రభుత్వం చేసిన అతిపెద్ద తప్పిదమని మంత్రి ఆరోపించారు. ఈ నిర్ణయం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. "పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారు. కానీ ఒక్క ఎకరానికి కూడా సాగునీటి సౌకర్యం కల్పించలేదు" అని విమర్శించారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు. నల్గొండ జిల్లాలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు కూడా ఏళ్ల తరబడి ముందుకు సాగలేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టుపై వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనం అందలేదన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "ప్రజల సొమ్ము లక్షల కోట్లు ఖర్చు చేసి సాగునీటి ప్రయోజనాలు కల్పించడంలో విఫలమయ్యారు. ఇప్పుడు మాకు నీతులు చెప్పే హక్కు వారికి లేదు" అని మండిపడ్డారు.

కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా పోరాడుతోందని మంత్రి తెలిపారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ముందు తెలంగాణ హక్కుల కోసం బలంగా వాదిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే తెలంగాణ ఎక్కువ కృష్ణా జలాలను వినియోగించుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ వరి ఉత్పత్తి, సేకరణ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 71.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ జరిగిందని, ఇది జాతీయ రికార్డు అని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు --రంగారెడ్డి, నారాయణపేట--కొడంగల్, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

"మా హయాంలో లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు అందిస్తాం. పాలమూరు రైతులు చారిత్రాత్మక మార్పును చూస్తారు" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

### ప్రకృతిని కాపాడకపోతే మనిషికి

# మనుగడే లేదు

నారాయణపేట ప్రతినిధి జూన్ 5 (ప్రజా జ్యోతి)

మన జీవనానికి ఆధారమైన గాలి, నీరు, నేల, చెట్లు జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు సురక్షితమని మనిషి మనుగడ సాధ్యమని పాలమూరు ఎంపీ డి కే అరుణ అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నారాయణపేట మండలం సింగారం చౌరస్తా సమీపంలో ప్రధాని 12 ఏళ్ల విశ్వాసం.అభివృద్ధి,ప్రజా సంక్షేమం ప్రచార సేవా కమిటీ జిల్లా కన్వీనర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ డి కే అరుణ మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు మానవాళి భవిష్యత్తుకు సవాళ్లుగా మారుతున్నా యనీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరం తల్లి పేరున కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిశుభ్రమైన పచ్చని వాతావరణ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి ,ప్రతాప్ రెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి,ప్రజాప్రతినిధులు,జిల్లా,మండల,పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను

# సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)

వివాదాలను పెంచుకుంటూ పోతే అవి జీవితకాలం కొనసాగుతాయని, పరస్పర అవగాహనతో రాజీకి వస్తే వెంటనే పరిష్కారమవుతాయని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీ వరకు నారాయణపేట, కోస్గి, మక్తల్ కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ పడదగిన కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పోషణ కేసులు, వైవాహిక వివాదాలు, రోడ్డు ప్రమాద పరిహార కేసులు, చిన్నపాటి దొంగతనాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ బకాయిలు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.

చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని, న్యాయస్థానం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు మరియు పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.

### పిడుగుపాటుకు కానిస్టేబుల్ మృతి

ఉప్పునుంతల జూన్ 5,

ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు విధులు ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణంలో వస్తున్న ఓ పోలీసు కానిస్టేబుల్ పిడుగుపాటుకు గురై మృతి చెందిన విషాద ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలం, ఉల్పర గ్రామానికి చెందిన ముద్దమల్ల రాజు (37) 2014 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌గా నాగర్‌కర్నూల్ ఆర్మ్డ్ రిజర్వ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో గత రెండు రోజులుగా సోమశిల ప్రాంతంలో ఏర్పాటు చేసిన బందోబస్తు విధుల్లో పాల్గొన్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని కారులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో వస్తుండగా మామిళ్లపల్లి గ్రామం సమీపంలో మూత్ర విసర్జన కోసం వాహనం దిగాడు. అదే సమయంలో అకస్మాత్తుగా పిడుగు పడటంతో రాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

# పాలమూరు ప్రాంతానికి... కృష్ణ జలాలు పారించడమే లక్ష్యం

**-ప్రాజెక్ట్ పనులు నిర్దేశిత.. గడువులో పూర్తి చేయాలి**
**- అధికారులకు ఆదేశాలు జారీచేసిన**
**- సీఎం రేవంత్ రెడ్డి**





**నాగర్ కర్నూల్ జూన్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
ఉమ్మడి పాలమూరు లో కృష్ణ జలాలను పారించి, పాలమూరు ప్రాజెక్టులను నిర్దేశిత గడువులో పూర్తిచేసి, ప్రాంతానికి సాగు, త్రాగునీళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గంలో పరిధిలోని పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లపూర్ ప్యాకేజీ టు ప్యాకేజీ 3 కాల్వల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కృష్ణారావు,వాకిటి శ్రీహరి తో కలిసి, క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. కాల్వ పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ చేరుకొని,డెలివరీ సిస్టర్ ను సంబంధిత మంత్రులు ఉన్నత శాఖ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిర్దేశిత కదువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు మరియు తాగునీరు అందించాలని మంత్రులకు ఆ శాఖ ఉన్నత అధికారులకు ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో ఎన్ని అవాంతరాలు ఎదురైన, అధిగమించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమ కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు రూపకల్పన చేసి, రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు,నీటిపారుదల శాఖ ఉన్నత అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు

## సేవాభావంతో వైద్య సేవలు అందించాలి

**– మేఘన హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వనపర్తి, జూన్ 5 (ప్రజాజ్యోతి):**
వనపర్తి పట్టణంలోని గాంధీచౌక్లో నూతనంగా ఏర్పాటు చేసిన మేఘన హాస్పిటల్ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ బ్రహ్మం చారి, రమేష్ ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో ఆధునిక వైద్య సదుపాయాలు కలిగిన ఆసుపత్రుల అవసరం ఎంతో ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులను ఆశ్రయించే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య వృత్తిని వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో నిర్వహించాలని పేర్కొన్నారు. భగవంతుడి తర్వాత ప్రజలకు ప్రాణదాతలుగా నిలిచేది వైద్యులేనని, రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరి రాములు, పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాపర్ల రాంరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# నేల ఆరోగ్య పరిరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యం

**జగ్గ నాయక్**

**వడ్డేపల్లి జూన్ 5(ప్రజా జ్యోతి):**
మండల పరిధిలోని జూలకల్లు గ్రామ రైతు వేదికలో శుక్రవారం"కేట్ బచావో అభియాన్"కార్యక్రమంలో భాగంగా నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ)జగ్గ నాయక్ మాట్లాడుతూ,నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పచ్చిరొట్ట ఎరువుల వినియోగం,సేంద్రియ వ్యవసాయం,సమతుల్య ఎరువుల వాడకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల నేల సారవంతత తగ్గిపోతుందని,తద్వారా దిగుబడులు తగ్గి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతోందని తెలిపారు.రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపడంతో పాటు,నేల ఆరోగ్య పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జె.రాధ,గ్రామ సర్పంచ్ హెచ్.రాజు,ఉప సర్పంచ్ సోమశేఖర్,పంచాయతీ కార్యదర్శి సత్యకి,బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీధర్ రెడ్డి,ఏఈఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అధికారులు రైతులకు నేల నమూనాల సేకరణ,సేంద్రియ ఎరువుల తయారీ,సమగ్ర పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు.గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.





## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా బచ్చు రాము

**– ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్న నూతన వైస్ చైర్మన్**



**వనపర్తి, జూన్ 5 (ప్రజాజ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శుక్రవారం వనపర్తి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రాముకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పేద ఆర్యవైశ్యులు, విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. బచ్చు రాము మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేద ఆర్యవైశ్య కుటుంబాలు, విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, సమాజ అభ్యున్నతికి నిరంతరం సేవలందిస్తానని పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఆశయాలకు కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు రమేష్ చంద్ర, లెగిసెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## కొల్లాపూర్ లో... ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



**నాగర్ కర్నూల్ జూన్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సమీక్షకు రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం రాత్రి సోమశిల వద్ద ఉన్న అతిథి గృహంలో బసవేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, శుక్రవారం ఉదయం కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటికి చేరుకోగా, నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అల్పాహారం అనంతరం అక్కడికి వచ్చేసిన పలువురు ప్రజాప్రతినిధులు నాయకులకు కరచాల కం అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. ముఖ్య నాయకులు కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం సమీపంలోని ఎల్లూర్ పంప్ హౌస్ వద్దకు బయలుదేరారు.

## శ్రీ వాసవి మాత ఆశీస్సులు ఉండాలి

**మల్దకల్ జూన్ 05(ప్రజా జ్యోతి):**
ఆర్యవైశ్య కుల దేవత అయిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ పట్వారి ప్రహల్లాదరావు అన్నారు.శుక్రవారం మల్దకల్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మల్దకల్ గ్రామానికి చెందిన గనేకల్ రామకృష్ణ సరిత దంపతుల కుమార్తె పుట్టు చీర మహోత్సవ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించి స్వామివారి శేష వస్త్రం చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర రావు, పాల్గొన్నారు.



# ఘనంగా చిట్టెం అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)**

టీపీసీసీ సభ్యులు చిట్టెం.అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నారాయణపేట పట్టణంలోని సీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, యువతకు అండగా నిలుస్తున్న అభిజయ్ రెడ్డి సేవలను కొనియాడారు. దివంగత నాయకులు చిట్టెం నర్సిరెడ్డి,చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. నారాయణపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం.పర్ణిక రెడ్డి గారితో కలిసి సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపుతూ వందలాది మంది యువకుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. పార్టీ బలోపేతం,ప్రజా సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి కల్పన,సామాజిక సేవా కార్యక్రమాల్లో అభిజయ్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం,సీనియర్ నాయకులు ఎండి. గౌస్,కోట్ల.రవీందర్ రెడ్డి,ఆర్టీవో బోర్డు డైరెక్టర్ పోషల్ రాజేష్, పళ్ళ అనిల్,వెంకు గౌడ్,అఖిల్ రెడ్డి, సందీప్ రెడ్డి,సంగారెడ్డి,కార్తీక్ రెడ్డి, ఎరుకలి. వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# జడ్చర్ల బహిరంగ సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు




**అడ్డాకుల, జూన్ 5 (ప్రజాజ్యోతి):**

జడ్చర్లలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు అడ్డాకుల మండలం కందూర్ గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ ఎత్తున బయలుదేరారు. దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సభకు తరలివెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకానుండటంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామం నుంచి వాహనాల ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి అనుకూల నినాదాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ వేదిక కానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ మేస్త్రీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)**

లక్షల రూపాయలు ఖర్చుపెట్టి సెంట్రింగ్ తెచ్చుకొని పనిచేస్తున్న సెంట్రింగ్ మేస్త్రీలకు గిట్టుబాటు రేట్లు ఇవ్వడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం ఆవేదన వ్యక్తం చేశారు ఈ దీక్షలకు శుక్రవారం రోజు ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సెంట్రింగ్ మేస్త్రీల రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు.
స్క్వేర్ ఫీట్ కు 200 రూపాయలు , సెంట్రింగ్ రాడ్ బెండింగ్ స్క్వేర్ ఫీట్ కు 40 రూపాయలు అమలు చేయాలని చేస్తున్న దీక్షలు న్యాయమైనవని అన్నారు.
సెంట్రింగ్ మేస్త్రి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ గారు అదేవిధంగా జిల్లా లేబర్ అధికారి గారు స్పందించాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా తమ సమస్యలు పరిష్కరించెందుకు ముందుకు రావడం లేదని,తమ సమస్యలు పరిష్కరించే వరకు సెంట్రింగ్ మేస్త్రీల సమ్మె కొనసాగుతుందని జై దుర్గ భవాని సెంట్రింగ్ యూనియన్ పట్టణ అధ్యక్షులు డి బాబు, కార్యదర్శి జె లక్ష్మణ్ డిమాండ్ చేశారు .సెంట్రింగ్ మేస్త్రీలు చేస్తున్న దీక్షలకు సిపిఎం సోషల్ మీడియా ఇంచార్జ్ సోఫీ మజార్ హుస్సేన్, సిపిఐ ఎంఎల్ ప్రజా పంత పట్టణ నాయకులు కెంచె నారాయణ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి కే కాశప్ప మద్దతు తెలిపి మాట్లాడారు .
ఈ దీక్షలలో జై దుర్గా భవాని సెంట్రింగ్ యూనియన్ నాయకులు కోశాధికారి ఎస్ నరేష్, ఉపాధ్యక్షులు కే లక్ష్మణ్ గౌరవాధ్యక్షులు దండు భూషణ గౌరవ ఉపాధ్యక్షులు బీ మల్లప్ప కార్యదర్శి బండి నరసింహా తదితరులు పాల్గొన్నారు




## శ్రీ స్వయంభూ తిమ్మప్ప స్వామి దేవాలయానికి ఫ్రిడ్జ్ వితరణ

**మల్దకల్ జూన్ 05(ప్రజా జ్యోతి):**

ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి శేషంపల్లి గ్రామానికి చెందిన నాయికి సరస్వతి తిమ్మారెడ్డి దంపతులు ఫ్రిడ్జ్ ని బహుకరించారు. శుక్రవారం దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్యచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఫ్రిడ్జ్ ని అందజేశారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించిన అనంతరం వారికి స్వామి వారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు ఫోటోను అందజేశారు.



## డ్రగ్స్,గంజాయిపై ఉక్కుపాదం

### శాంతినగర్‌లో విస్తృత తనిఖీలు

**వడ్డేపల్లి జూన్ 5(ప్రజా జ్యోతి):**

పట్టణంలో డ్రగ్స్,గంజాయి,ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కోసం శాంతినగర్ పోలీసులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతినగర్ ఎస్సై నాగ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి కళాశాలలు,పాఠశాలల పరిసరాలు,వైన్ షాపులు,కిరాణా దుకాణాలు,బస్టాండ్,రైల్వే స్టేషన్ ప్రాంతాలతో పాటు అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,శాంతినగర్‌ను"డ్రగ్స్ ఫ్రీ టౌన్"గా తీర్చిదిద్దడమే పోలీసుల లక్ష్యమని తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి,ఇతర మత్తు పదార్థాల విక్రయం,వినియోగం,సరఫరాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలను అక్రమంగా విక్రయించినా, వినియోగించినా లేదా సరఫరా చేసినా ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని,జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు విధించబడతాయని స్పష్టం చేశారు. కళాశాలలు,పాఠశాలల యాజమాన్యాలు,వైన్ షాపులు,కిరాణా దుకాణాల నిర్వాహకులు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రానున్న రోజుల్లో తనిఖీలను మరింత ముమ్మరం చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



# నల్లకుంటలో వీధి కుక్కల దాడులు

**-తక్షణ చర్యలు తీసుకోవాలి**

**-కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్**

**గద్వాల జూన్ 5(ప్రజా జ్యోతి):**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంట ప్రాంతంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని,ప్రజల భద్రత కోసం మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని 21వ వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ కోరారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నల్లకుంట ప్రాంతానికి చెందిన ఆర్ఎంబీ నరసింహులు అనే వ్యక్తిపై వీధి కుక్కలు గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని తెలిపారు. కుక్కల కాట్ల వల్ల ఆయనకు రక్తస్రావం కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. వీధి కుక్కల సమస్యపై గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించినప్పటికీ,ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు,కమిషనర్ వెంటనే స్పందించి నల్లకుంట ప్రాంతంలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు





# క్రీడల్లో గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించాలి





## బాసు హనుమంతు నాయుడు

**ధరూర్ జూన్ 5(ప్రజా జ్యోతి):**
గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలంలోని పెద్దపాడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ సవారమ్మ అవ్వ ఉర్ల దేవర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి,కొబ్బరికాయ కొట్టి టోర్నమెంట్‌ను ప్రారంభించారు.కార్యక్రమానికి హాజరైన బాసు హనుమంతు నాయుడికి గ్రామ నాయకులు,క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,క్రీడా పోటీల నిర్వహణ వల్ల గ్రామాల మధ్య సత్సంబంధాలు పెంపొందడంతో పాటు యువతలో స్నేహభావం,క్రీడాస్ఫూర్తి పెరుగుతాయని అన్నారు.శ్రీ సవారమ్మ అవ్వ దేవర మహోత్సవం సందర్భంగా అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుని జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు.విద్యతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని, ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా దానిని విజయానికి నాందిగా భావించాలని అన్నారు.అలాగే విజయం సాధించిన వారు గర్వపడకుండా క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, అల్లపాడు ప్రతాప్,చిన్నపాడు ఆంజనేయులు,కౌన్సిలర్ జగదీష్,వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి,రాముడు,లక్ష్మారెడ్డి,శ్రీరాములు,ఆంజనేయులు,గోనుపాడు మాలిక్, రవి,చంద్రశేఖర్,తిమ్మప్ప,మహేంద్ర,రాజు,మహేష్,కృష్ణ,వీరేష్,చంటి,మోహన్, ముని, హరికృష్ణ,జయన్న,వెంకటప్ప,శివా తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు,క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**- బూజల సోమమ్మ--రంగారెడ్డి మెమోరియల్ సొసైటీ సేవలకు ప్రశంసలు**

**- గుమ్మడంలో ఉచిత ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**పెబ్బేరు, జూన్ 5 (ప్రజాజ్యోతి):**
పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో బూజల సోమమ్మ--రంగారెడ్డి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. బూజల భువనేశ్వర్ రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి అందుబాటు ప్రజారోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సొసైటీ నిర్వహిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఇప్పటివరకు 140 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు




రాజశేఖర్, వెంకటేష్, వడ్డె రమేష్, మధు, గోవిందు, సాయినాథ్, గ్రామ సర్పంచ్ నగేష్ బాపు రెడ్డి, చెన్నయ్య, మహమ్మద్ నసీరుద్దీన్, ఆంజనేయులు, బాలస్వామి, నరసింహా, పురుషోత్తం, ఈశ్వర్, వేణు, నాగరాజు, మదిలేటి, కురుమూర్తి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో ముఖ్యమంత్రిని కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్

**జడ్చర్ల, జూన్ 5 ( ప్రజాజ్యోతి బ్యూరో ) :**
జడ్చర్లలో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ కూడా పాల్గొన్నారు. కర్వేన ప్రాజెక్టు సందర్శన అనంతరం పాత్రికేయులతో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, అనంతరం జడ్చర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తనదేనని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు జిల్లా అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతుల సంక్షేమం, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి తన దృక్పథాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు, పాలమూరు జిల్లా ప్రగతి, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేసిన ఆనంద్ కుమార్ గౌడ్, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్




**అయిజ జూన్ 5(ప్రజా జ్యోతి):**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో మేడికొండ గ్రామంలో కార్యక్రమం నిర్వహించి,పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన డిమాండ్లతో తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెట్ల సంరక్షణ,అడవుల పెంపకం,ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ,కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.భూతాపం ప్రభావాలను తగ్గించేందుకు సౌర,పవన విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని,సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.అలాగే పిల్లల ఆరోగ్యం,విద్య,భద్రతకు అనుకూలమైన పర్యావరణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లైజమ్మ, ప్రభాకర్,జి.నర్సిములు,వినోద్,పద్మతో పాటు కూలీ కార్మికులు పాల్గొన్నారు.

# పచ్చని ప్రకృతి పల్లె ప్రజల ప్రాణాలకు ఊపిరి

## పెద్దపల్లి సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖరరెడ్డి



**మల్దకల్ జూన్ 5(ప్రజా జ్యోతి):**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ,"ఒక్క చెట్టు నాటితే వందల ప్రాణాలకు ఊపిరి పోసినట్లే"అని పేర్కొంటూ గ్రామస్థులతో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం కీలకమని,ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,గ్రామ కార్యదర్శి శేఖర్,వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# కొల్లంపల్లి దర్గా ను దర్శనం చేసుకున్న పీఠాధిపతి ఆశీర్వాదాలు తీసుకున్న భరత్ కౌన్సిలర్

నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)
కొల్లంపల్లి దర్గాలో దర్శనం చేసుకొని తదుపరి దర్గా పీఠాధిపతి గారి దగ్గర ఆశీర్వాదం తీసుకోవడం జరిగినది, అలాగే కొల్లంపల్లి దర్గా ఆవరణలో జరిగిన టీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త ఇబ్రాహీం అక్క గారి వివాహానికి హాజరైన 7వ వర్డ్ కౌన్సిలర్ నాదేపల్లి భరత్ గారు , శరత్, సయ్యద్ ఆరిఫ్ ఖాద్రి, సమీ, సయ్యద్ కమల్ హుస్సేని పాల్గొన్నారు





# పర్యావరణాన్ని కాపాడటం చట్టబద్ధమైన బాధ్యత

**ప్లాస్టిక్ వద్దు, పచ్చదనం ముద్దు**
**జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు.**

**నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు హరిత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ రోజుల్లో, అభివృద్ధి పేరుతో మనం ప్రకృతికి తీవ్రమైన హాని తలపెడుతున్నాం. విచక్షణారహితంగా అడవులను నరికివేయడం, ప్లాస్టిక్ వాడకం పెంచడం, మరియు కర్మాగారాల నుండి వచ్చే కాలుష్యం వల్ల భూమి వేడెక్కుతోంది. ఫలితంగా కరువులు, వరదలు, మరియు విచిత్రమైన వాతావరణ మార్పులను ఎదుర్కొంటున్నాం. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి చట్టబద్ధమైన బాధ్యత అని తెలిపారు. కోర్టు ఆవరణంలో పుల మొక్కలు మరియు పండ్ల మొక్కలను నాటి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ మరియు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్, ద్వితీయ శ్రేణి న్యాయాధికారి మురళీధర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కములుద్దీన్, ఫారెస్ట్ సిబ్బంది, మరియు మునిసిపల్ కమీషనర్ శంకర్, మున్సిపాలిటీ సిబ్బంది , చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్ సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పోలీస్ అధికారులు మరియు పారా లీగల్ వాలంటీర్లు కార్యక్రమం లో పాల్గొని మొక్కలు నాటారు.





# నారాయణపేట జిల్లా దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు

**-ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ**
**-సీఎం గాలి మోటార్లో తిరుగుతూ..**
**గాలి మాటలు చెబుతున్నారు.**
**-కాంగ్రెస్ గాలిలో అధికారంలోకి వచ్చింది.. త్వరలో గాల్లో కలిసిపోతుంది. -కాంగ్రెస్ వైఫల్యాల పై పోరాటాలు,నిరసన దీక్షలకు సిద్ధం కావాలి.**
**-ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలి సంపూర్ణ సహకారం, మద్దతు ఉంటుందని భరోసా**
**-ఏక్ పేడ్ మా కే నామ్ పిలుపులో భాగంగా ద్వారక స్కూల్ ఆవరణలో మొక్కలు నాటిన ఎంపీ డీకే అరుణ**

**నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా ద్వారక స్కూల్ లో జరిగిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ సమావేశంలో కార్యకర్తలకు, పార్టీ నాయకులకు తెలంగాణ లో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తి వంచన లేకుండా పని చేయాలని దిశ నిర్దేశం చేశారు. కార్యకర్తల కఠోర దీక్ష పట్టుదల, మోదీ నాయకత్వం పై విశ్వాసంతో పశ్చిమ బెంగాల్ లోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పెద్ద కష్టమైన పని కాదని, సమిష్టి కృషితో, అందరం కలసి కట్టుగా లక్ష్యం కోసం ప్రతి కార్యకర్త కంకణబద్దులై పని చేయాలని, జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయిలలో స్థానిక సమస్యల పై పోరాటాలు,దీక్షలు,నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున కార్యాచరణ సిద్ధం చేయాలని, కార్యకర్తలు చేసే ప్రతి పోరాటంలో తాము భాగస్వామ్యులు అవుతామని, పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. తెలంగాణ కషాయమయం చేస్తామని సంకల్పం తీసుకొని పని చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజల సమస్యలు పరిష్కరించే కార్యకర్తకు తప్పకుండా సముచిత గౌరవం పార్టీలో దక్కుతుందని అన్నారు. తెలంగాణ ప్రజలు ఆదరాభిమానాలు చూరగొనలని సూచించారు. పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో, ప్రస్తుతం కాంగ్రెస్ రెండేళ్లలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శించారు. భవిష్యత్ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరు అడ్డుకోలేరని విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకు కార్యకర్తలు అందరి కలసి పని చేయాలని సూచించారు.ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలను చైతన్యపరచి కేంద్ర ప్రభుత్వ పథకాలు,విధానాలు తెలియజేయడంతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వ హామీలు గుర్తు చేస్తూ.. వైఫల్యాల పై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండా రాష్ట్రంలో ఏ పథకం లేదని, పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారం నుంచి మొదలు పెడితే అన్నింటిలో కేంద్రం నిధులు ఉన్నాయని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటార్లో తిరుగుతూ.. గాలి మాటలు చెబుతున్నారని, గాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గాల్లో కలసి పోతుందని ఎంపీ డీకే అరుణ ఎద్దేవ చేశారు. తెలంగాణ అభివృద్ధి పైన అవగాహన, చిత్తశుద్ధి కాంగ్రెస్ కి లేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ పదేళ్లలో కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానని చెప్పి చేయలేదని, కాంగ్రెస్ రెండున్నర ఏళ్లలో ఏం చేసింది లేదని విమర్శించారు.

ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తున్నారు.. తప్ప నిజమైన అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి సొమ్ము నుంచి ఇవ్వడం లేదని, ప్రజల సొమ్ముతో ఇస్తున్నారని ప్రతి ఒక్కరు ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏ నియోజకవర్గంలో పర్యటించిన రోడ్ల గతి తెలుస్తుందని, కనీసం గుంతలు కూడా పూడ్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ మహబూబ్ నగర్ జిల్లాలో జరుగుతున్న రహదారుల పనులు కేంద్రం ప్రభుత్వం నిధులతో భారత్ మాల, జాతీయ రహదారుల పనులు తప్ప మరేం లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు.

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో 90శాతం ఎగ్గొట్టారని, మహిళలకు మహాలక్ష్మీ చేయూత ప్రతి నెల 2500 రూపాయలు అన్నారు, యువతులకు స్కూటీలు, తులం బంగారం, పెన్షన్ ల పెంపు అన్నారు, ఏది ఇవ్వలేదు. రైతులు, నిరుద్యోగులను, ఉద్యోగులను, అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. రెండున్నర ఏళ్ళు ప్రభుత్వానికి సమయం ఇచ్చాం.. హామీలు అమలు చేయాలని రోజుకో అంశంతో నిరసనలు చేయాలి.

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్ గారు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంతన్ పాండు రెడ్డి గారు,పగడకుల శ్రీనివాస్ గారు, తిరుపతి రెడ్డి గారు,లక్ష్మీ శ్యామ్ సుందర్ గారు,కొండయ్య గారు, లహుటి శ్రీనివాస్ గారు,బలరాం రెడ్డి, రఘురామయ్య గారు, ప్రతాప్ రెడ్డి గారు, లక్ష్మీకాంత్ రెడ్డి గారు,బీజేపీ నాయకులు గారు, జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కిష్టంపల్లిలో విషాదం.. ఇద్దరు బాలలు చెరువులో మునిగి మృతి





**జడ్చర్ల, జూన్ 5 ( ప్రజాజ్యోతి ) :** జడ్చర్ల మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామ పరిధిలోని ఎర్ర చెరువులో ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు. మృతులు నిమ్మబావి గడ్డకు చెందిన వారిగా గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు గ్రామస్తులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం చెరువులో నుంచి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో కిష్టంపల్లి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్తులు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి



**నారాయణపేట ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)**
ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నారాయణపేట ప్రాజెక్ట్ నాయకులు శీలం బుగ్గమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం రోజు నారాయణపేట మండల పరిధిలో కోటకొండ గ్రామ సర్పంచ్ శ్రీ వెంకట్రాములు గౌడ్ , పంచాయతీ కార్యదర్శి శ్రీమతి చానిక్య రెడ్డి లకు అంగన్వాడీ యూనియన్ నాయకులు కోటకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానంలో భాగంగా అంగన్వాడీల కేంద్రాలకు ఎసురు పెట్టే కార్యక్రమానికి పూనుకొన్నదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకట లక్ష్మి, అంజమ్మ, రుక్మిణి ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

## ఆసరా పెన్షన్ల దరఖాస్తులపై స్పష్టతనిచ్చిన డి.ఆర్.డి.ఓ



**నారాయణపేట, ప్రతినిధి జూన్ 05 (ప్రజా జ్యోతి)**
జిల్లాలో ఆసరా పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై నారాయణపేట డి.ఆర్.డి.ఓ ఎన్. వెంకట రాములు కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి కొత్త దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఎటువంటి అధికారిక ఆదేశాలు అందలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీ–సేవ కేంద్రాల్లో ఆసరా పెన్షన్ల నమోదు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. కావున, ఆన్లైన్ దరఖాస్తుల కోసం ప్రజలు మీ–సేవ కేంద్రాలకు వెళ్లి సమయాన్ని వృథా చేసుకోవద్దని ఆయన సూచించారు. అదే సమయంలో, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు గ్రామ పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. తమ పరిధిలో ఎవరైనా అర్హులైన వారు పెన్షన్ల కోసం స్వచ్ఛందంగా దరఖాస్తులు సమర్పించినట్లయితే, వాటిని స్వీకరించి భద్రపరచాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు అందిన వెంటనే తదుపరి ప్రక్రియను చేపడతామని డి.ఆర్.డి.ఓ వెల్లడించారు.